
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
3★★★
సోమవారం 8 ఏప్రిల్ 2024



కేసీఆర్‌కు మతి భ్రమించింది
టీపీసీసీ అధికార ప్రతినిధి మృత్యుంజయం 6
రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:29 సోమవారం
సహర్ 4:35 మంగళవారం

- ప్రాజెక్టుల నిర్మాణానికి ఉన్న ఊరు.. తిండిపెట్టే భూములను ఇచ్చిన నిర్వాసితులు
- ప్రస్తుతం నీటిమట్టాలు తగ్గడంతో బయటపడుతున్న నాటి ఆనవాళ్లు
- అప్పటి రోజులను గుర్తు చేసుకుంటున్న గ్రామస్థులు

ఇంకిన నీటిలో.. కదలాడుతున్న జ్ఞాపకాలు

ఎటు చూసినా కూలిపోయిన గోడలు, మోడుబారిన చెట్లు, శిథిలమైన రహదారులు, పాడుబడిన పాఠశాలలు, ఆలయాలు. పుట్టిపెరిగిన ఊళ్లను చూసి నిర్వాసితుల గుండెలు బరువెక్కుతున్నాయి. ఏళ్ల తరబడి తిరిగిన పరిసరాలు జ్ఞాపకాలుగా మిగిలిపోవడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. జిల్లాలోని శ్రీరాజ రాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులో 11 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ప్రస్తుతం నీటి మట్టం తగ్గి ఆనవాళ్లు కళ్లెదుట మరోసారి కదలాడడంతో ఉద్వేగానికి గురవుతున్నారు. తేలిన తమ ఇళ్ల వద్దకు వెళ్లి గడిచిన రోజులను గుర్తు చేసుకుంటున్నారు.

7

■ ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల


చీర్లవంచ గ్రామం

వడ..దడ

- జిల్లాలో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత
- ఉక్కపోతతో కదలని జనం
- సాయంత్రం వేళ ఉపశమనం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సుర్రుమంటున్న ఎండ, వడగాల్పులతో జిల్లా ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో ప్రజలు ఎక్కువగా ఇంట్లో నుంచి బయటకు రాలేదు. రద్దీగా ఉండే సిరిసిల్లలోని ప్రాంతాలు నిర్మానుష్యంగా కనిపించాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలై సాయంత్రం 5 గంటల వరకు ఉక్కిరి బిక్కిరి చేసింది. జిల్లాలో కనిష్ఠంగా ఉష్ణోగ్రత 24.9, గరిష్ఠంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయాయి. మూడు రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతతో ఇబ్బందులు పడిన ప్రజలకు ఆదివారం సాయంత్రం మబ్బులు కమ్ముకొని వాతావరణం చల్లబడడంతో కాస్తా ఉపశమనంగా కనిపించింది. వడగాలులు మాత్రం ఇబ్బంది పెట్టాయి



మండలం	వెదర్ స్టేషన్	కనిష్ఠం	గరిష్ఠం
కోనరావుపేట	మర్తనపేట	25.2	43.8
కోనరావుపేట	నిజామాబాద్	27.3	39.8
సిరిసిల్ల	కలెక్టరేట్	28.9	43.4
సిరిసిల్ల	పెద్దూర్	26.7	42.4
వేములవాడ అర్బన్	నాంపల్లి	26.9	42.3
ఇల్లంతకుంట	ఇల్లంతకుంట	27.4	42.8
ఇల్లంతకుంట	కందికట్కూర్	24.9	41.1
ఇల్లంతకుంట	పెద్దలింగాపూర్	27.4	40.0
వీర్నపల్లి	వీర్నపల్లి	25.7	42.2
వేములవాడ రూరల్	మల్లారం	26.8	42.0
వేములవాడ రూరల్	వట్టెంల	26.4	41.2
బోయినపల్లి	బోయినపల్లి	26.4	41.7
చందుర్తి	మర్రిగడ్డ	26.9	41.5
రుద్రంగి	రుద్రంగి	26.8	41.9
రుద్రంగి	మానాల	27.1	39.7
తంగళ్లపల్లి	నేరేళ్ల	27.1	41.2
ముస్తాబాద్	నామాపూర్	27.0	41.2
ముస్తాబాద్	అవునూర్	25.3	40.0
ఎల్లారెడ్డిపేట	ఎల్లారెడ్డిపేట	28.4	40.7
గంభీరావుపేట	గంభీరావుపేట	27.9	40.8
గంభీరావుపేట	గజసింగవరం	27.0	39.9

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 7: జూనియర్ న్యాయవాదులు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని మొదటి బైపాస్ రహదారివైపు శ్రీరేణుకా ఎల్లమ్మ కల్యాణ మండపంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ), సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్‌లు సంయుక్తంగా నూతన చట్టాలపై ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం కొత్తగా వస్తున్న చట్టాలపై ప్రతీ న్యాయవాది అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టాలపై అవగాహన ఉంటే కక్షిదారులకు న్యాయం చేయగలిగే అవకాశం ఉంటుందన్నారు. న్యాయవాద వృత్తి సమాజంలో గౌరవంతో కూడకున్నదన్నారు. ప్రధానంగా జూనియర్ న్యాయవాదులకు ఇలాంటి వర్క్‌షాప్‌లు తరుచూ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్క్‌షాప్‌లు నిర్వహించడంతో న్యాయవాదులకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. వర్క్‌షాప్‌లో భాగంగా నూతన చట్టాలపై రిటైర్డ్ జిల్లా జడ్జి సి. హరేకృష్ణ భూపతి, క్రిమినల్ చట్టాలపై ఎల్.హెచ్. రాజేశ్వర్‌రావు, సివిల్ చట్టాలపై పొడిశెట్టి శ్రీనివాస్, పోక్సో యాక్ట్‌పై సామ హేమలత అవగాహన కల్పించారు. అంతకుముందు జడ్జిలను, బార్ అసోసియేషన్ అధ్యక్షులను, నిర్వాహకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ సీనియర్ సివిల్ జడ్జిలు శ్రీలేఖ, సట్టు రవిందర్, సిరిసిల్ల జూనియర్ సివిల్ జడ్జి సృజన, ఏపీపీలు విక్రాంత్, తిరుపతి, పీపీలు అంజయ్య, పెంట శ్రీనివాస్, బాలల సంరక్షణ సమితి అధ్యక్షుడు కంటం అంజయ్య, సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు డొర్నాల సంజీవరెడ్డి, గుడిసె సదానందం, కార్యదర్శి వెంకటి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


హాజరైన న్యాయవాదులు

10న బీజేపీ ఆధ్వర్యంలో నేతన్నల దీక్ష

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 7 : వస్త్ర పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 10న సిరిసిల్లలో బీజేపీ ఆధ్వర్యంలో నేతన్నల దీక్ష చేపట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపీ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని నేతన్నలకు ఉపాధిని కల్పించాలని, ప్రభుత్వ ఆర్డర్‌లను ఇవ్వాలని పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలో బుధవారం చేపట్టే నేతన్నలకు ఉపాధి దీక్షలో కరీంనగర్ ఎంపీ బండిసంజయ్‌కుమార్ పాల్గొంటారని, నేతన్నలకు అండగా ఉంటారని తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని నూకలమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న విద్యార్థులు 22 సంవత్సరాల తరువాత ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. 2001-2002 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. బొడ్డు ప్రశాంత్, రోమాల జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి అద్భుత ప్రతిభ


చిన్నారి శ్రీతిక

కోనరావుపేట, ఏప్రిల్ 7 : ఈ చిన్నారిని చూస్తే ఆశ్చర్య పోక తప్పదు. చదువులో వయస్సుకు మించి తెలివితేటలు ప్రదర్శిస్తుంది. ప్రపంచ దేశాల రాజధానుల పేర్లను అవలీలగా చెబుతూ పలువురి మన్ననలను పొందుతోంది. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన భువనగిరి స్వర్ణలత- అభిలాష్ కూతురు శ్రీతికకు ఐదు సంవత్సరాలు. వాసవి విద్యాలయంలో ఒకటో తరగతి చదువుతోంది. 195 రాజధానుల పేర్లను అవలీలగా చెబుతోంది. అంతేకాకుండా మహాభారతంలోని 18 పర్వాలను అనర్గళంగా చెబుతోంది. జనగణమనను తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ, మరాఠీ భాషల్లో చక్కగా పాడుతూ పలువురిని ఆకట్టుకుంటోంది. పాఠశాల కరస్పాండెంట్ గుండా రామచంద్రం, మండలవాసులు చిన్నారిని అభినందిస్తున్నారు.

భోజనం బాగాలేదంటే ప్రిన్సిపాల్ కొట్టింది

- విద్యార్థిని తల్లిదండ్రుల ఆరోపణ


మాట్లాడుతున్న విద్యార్థిని తల్లిదండ్రులు

గంభీరావుపేట, ఏప్రిల్ 7 : భోజనం బాగాలేదంటే మా బిడ్డను ప్రిన్సిపాల్ మా ఎదుటే కొట్టిందని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపించారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనపై విద్యార్థిని తల్లిదండ్రులను సంప్రదించగా ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. గంభీరావుపేట మండలం నర్మాల సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాలలో నర్మాల మానేరు క్యాంపునకు చెందిన యశస్విని అనే బాలిక 5వ తరగతి చదువుతోంది. యశస్వినికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో శుక్రవారం ఆసుపత్రికి తీసుకెళ్లి తిరిగి పాఠశాలకు పంపించి వచ్చామని తండ్రి ఎడ్ల ఎల్లం తెలిపారు. మీ కూతురు అల్లరి చేస్తోందని పాఠశాల వార్డెన్ ఫోన్ చేయడంతో ఏం జరిగిందోననే ఆత్రుతతో పాఠశాలకు వెళ్లామన్నారు. భోజనం బాగలేదని తమ కూతురు చెప్పిందని, అక్కడే ఉన్న ప్రిన్సిపాల్ ఆమెపై చేయి చేసుకుందని అన్నారు. తమ కూతురు చేసిన తప్పేంటి ఎందుకు కొట్టాల్సి వచ్చిందని, సంబంధిత అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని విద్యార్థిని తండ్రి అధికారులను కోరారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్

చందుర్తి, ఏప్రిల్ 7 : చందుర్తి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో నంబరు ప్లేట్‌లు లేని వాహనాలపై ఆదివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వివిధ గ్రామాల్లో కొనసాగిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా వాహనాలను తాత్కాలికంగా సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వాహనాలకు నంబరు ప్లేట్ సరిగ్గా కలిగి ఉండాలన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

కోనరావుపేట, ఏప్రిల్ 7: కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి తెలిపారు. అధ్యక్షుడిగా బొర్ర దేవదాస్, ఉపాధ్యక్షులుగా కర్రోల్ల మోహన్, కర్రోల్ల స్వామి, కోశాధికారిగా కన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎర్రోళ్ల శ్రావణ్ కుమార్, కార్యదర్శిగా బొర్ర శంకర్, సలహాదారులుగా ఎలగందుల అరవింద్, బుర్ర దినేష్, ఎర్రోళ్ల రాజేష్, కన్నం ప్రణీత్, కర్రోల్ల లెనిన్, కర్రోల్ల దేవరాజ్, ఎర్రోళ్ల శివ ఎన్నికయ్యారు.

నిర్మించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు

- నిరుపయోగంగా ప్లాస్టిక్ వేస్టేజ్ షెడ్



ఇల్లంతకుంటలోని ప్లాస్టిక్ వేస్టేజ్ షెడ్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 7: ప్లాస్టిక్ వేస్టేజిని ఒక్క దగ్గర చేర్చి అమ్మడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలనే లక్ష్యంతో నిర్మించిన షెడ్ నిరుపయోగంగా మారింది. మండలానికి ఒకటి చొప్పున ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ షెడ్ నిర్మించాలని కలెక్టర్ ఆదేశించారు. అందులో భాగంగా ఇల్లంతకుంట మండలకేంద్రంలోని బిక్కవాగు సమీపంలో నిర్మించాలని నిర్ణయించారు. ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.4 లక్షలు కేటాయించడంతోపాటు గ్రామపంచాయతీ ద్వారా రూ.లక్ష వినియోగించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. పనులు సత్వరమే పూర్తి చేయాలని అధికారుల ఒత్తిడి మేరకు సర్పంచ్ నిర్మాణం చేపట్టారు. షెడ్ నిర్మాణం పూర్తయి సంవత్సరం దాటిపోయినా ఇంత వరకు వినియోగం లోకి రాలేదు. మండలంలోని అన్ని గ్రామాలలో సేకరించిన చెత్త నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేసి మండలకేంద్రానికి తరలించాలని ఉన్నప్పటికీ అది ఆచరణకు నోచుకోలేదు. అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న షెడ్‌ను వినియోగంలోకి తేవాలని పలువురు కోరుచున్నారు.

గుంతలమయంగా రహదారి

- 3 కిలోమీటర్లు.. 130 గుంతలు - కంకర తేలిన రోడ్డు
- ప్రమాదకరంగా నారాయణపూర్, బండలింగంపల్లి రహదారి


గుంతలు పడిన రహదారి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్- బండలింగంపల్లి ప్రధాన రహదారి అడుగడుగునా గుంతలు ఏర్పడి ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మూడు కిలోమీటర్ల దూరం కలిగిన దారి పొడవునా 130 గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. కొన్ని చోట్ల కంకర తేలి ప్రయాణానికి నరకంగా తయారైంది. వాహనదారులు అదుపు తప్పి కింద పడిపోతున్నారు. తప్పించే ప్రయత్నంలో ప్రమాదాలకు గురవుతున్నారు.

ప్రయాణం.. ప్రహసనం

మండలంలోని నారాయణపూర్- బండలింగంపల్లి రహదారిని ప్రధాన మంత్రి సడక్ యోజన పథకం కింద సుమారు రూ.3 కోట్ల నిధులతో ఏడేళ్ల కిందట నిర్మించారు. నాణ్యత లేమితో నిర్మించడంతో ఏడాదికే గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. నిత్యం ఆ దారి గుండా సింగారం, బండలింగంపల్లి గ్రామంతోపాటు ముస్తాబాద్ మండలం ఆవునూరు, గూడెం, రాంరెడ్డిపల్లి తదితర గ్రామాలు, సిద్ధిపేట జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. నారాయణపూర్ నుంచి బండలింగంపల్లి వరకు సుమారు 3 కిలోమీటర్ల దూరంలో 130 గుంతలు ఉండడంతోపాటు పలు చోట్ల కంకర పూర్తిగా తేలి పోయి ప్రమాదకరంగా మారింది. ఆటోలు, వాహనాలు, ద్విచక్రవాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. నిత్యం ఆ రోడ్డుపై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మూడు నెలల వ్యవధిలో సుమారు 50 మంది వరకు ప్రమాదాలకు గురయ్యారు. పలుమార్లు రోడ్డుకు మరమ్మతు పనులు చేయాలని ఆటో డ్రైవర్లు, గ్రామస్థులు నిరసన వ్యక్తం చేసినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల యువకులు శ్రమదానం చేసి గుంతలను పూడ్చిన మళ్లీ ఏర్పడ్డాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారి మరమ్మతు పనులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.



కంకర లేచి ప్రమాదకరంగా మారిన రోడ్డు


ఆటో నడపాలంటేనే భయమేస్తోంది

- దేవేందర్, ఆటో డ్రైవర్ నారాయణపూర్



నారాయణపూర్- బండలింగంపల్లి రహదారిపై గుంతలు పడి అక్కడక్కడ కంకర లేచి అధ్వానంగా తయారైంది. గుంతలు కనిపించకపోవడంతో ఆటో నడపాలంటేనే భయం వేస్తోంది. ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని వాహనాన్ని నడుపుతున్నా. సార్లు పట్టించుకొని రోడ్డుపై పడిన గుంతను పూడ్చాలి. తేలిన కంకర వద్ద తారు వేయాలి.





తండాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు

- 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం


ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిపేట , వీర్నపల్లి మండలాల్లోని బుగ్గరాజేశ్వరతండా, రాశిగుట్టతండాల్లో ఎక్సైజ్ సీఐ ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు ఆదివారం మెరుపు దాడులు నిర్వహించారు. సారా తయారీ కేంద్రాలను కనుగొని నిల్వ చేసిన 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న 14 లీటర్ల సారా, ద్విచక్రవాహనంతో పాటు సారా తయారీ ముడి సరుకైన 20 కిలోల పటిక, 10 కిలోల ఇప్పపువ్వును స్వాధీన పర్చుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ ఎం శ్రీనివాస్ చెప్పారు. సారా తయారీ, రవాణా, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో తండాల్లో నిఘాను తీవ్రతరం చేశామని తెలిపారు. నిత్యం తనిఖీలు, దాడులు నిర్వహించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ ఎం. శ్రీనివాస్ స్పష్టం చేశారు. దాడుల్లో సిబ్బంది రాజు, కిశోర్, మల్లేశ్, కృష్ణ కాంత్, లావణ్య, శ్రీవాణి పాల్గొన్నారు.
















కొదురుపాక గ్రామం



రుద్రవరం గ్రామం



రుద్రవరం వేణుగోపాల స్వామి ఆలయం

ఇంకిన నీటిలో కదలాడుతున్న జ్ఞాపకాలు

వందల మంది నడిచిన దారులు.. వేల మందికి తిండిపెట్టిన పొలాలు.. ఎండలు మండినా చల్లని నీటినిచ్చిన బావులు.. ఊరందరినీ కాపాడిన దేవుళ్ల ఆలయాలు.. పిల్లలకు చదువు నేర్పి పెద్ద చేసిన పాఠశాలలు.. ఇవి మావీ అనుకుని నిశ్చింతగా జీవనం గడిపిన ఇళ్లు.. ఇలా.. ఒక్కొక్క జ్ఞాపకం తడారుతున్న నేల నుంచి బయటకు వస్తూ నిర్వాసితుల గుండెలు మెలిపెడుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్మించిన మిడ్ మానేరు, అనంతగిరి ప్రాజెక్టుల్లో 11 గ్రామాలు, 19,446 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. కాళేశ్వరం నుంచి నీటి విడుదల నిలిచిపోవడంతో అనంతగిరి, మిడ్‌మానేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిపోయాయి. దీంతో ప్రాజెక్టుల్లో ముంపునకు గురైన గ్రామాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు అక్కడికి వచ్చి తమ గ్రామాలను, ఇళ్లను చూస్తూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ■ ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల

- ప్రాజెక్టుల నిర్మాణానికి ఉన్న ఊరు.. తిండిపెట్టే భూములను ఇచ్చిన నిర్వాసితులు
- ప్రస్తుతం నీటిమట్టాలు తగ్గడంతో బయటపడుతున్న నాటి ఆనవాళ్లు
- అప్పటి రోజులను గుర్తు చేసుకుంటున్న గ్రామస్థులు

జిల్లాలోని మానేరు వాగుపై బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో 11 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 7419 ఇళ్లే, 19446 ఎకరాల వ్యవసాయ భూములు, ముంపునకు గురయ్యాయి. 10,131 కుటుంబాలు తమ ఇళ్లను వదిలిపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం అరకొర పరిహారం చెల్లించినా, ఎన్నో రకాల అసంతృప్తులు ఉన్నా నిర్వాసితులు ఉన్న ఊరును విడిచిపెట్టి పోయారు. వినని వారిని ప్రభుత్వం బలవంతంగా ఖాళీ చేయించింది. తమ తాత, ముత్తాతల నాటి భూములు, ఇళ్లను వదిలి వెళ్లిన వారు కొత్త ప్రాంతాల్లో ఇమడ లేక నానా ఇబ్బందులు పడ్డారు. రోజులు గడుస్తున్న కొద్దీ ప్రాజెక్టుల్లో నీరు నింపడం ప్రారంభమైంది. ఒక్కొక్కటిగా గ్రామాలు నీటిలో మునిగిపోయాయి. మిడ్‌మానేరు అనుబంధంగా నిర్మించిన అన్నపూర్ణ ప్రాజెక్ట్ కూడా జిల్లాలోని ఇల్లంతకుంటలో ఉంది. 1.5 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన ప్రాజెక్ట్‌లో అనంతగిరి గ్రామం ముంపునకు గురయ్యింది. 3947 ఎకరాల భూమి, 1124 కుటుంబాలు తరలిపోయాయి.

ప్రస్తుతం వేసవి కాలంలో ఎండలు పెరిగాయి. కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడంతో మిడ్‌మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్టులకు వచ్చే నీరు నిలిచిపోయింది. 27.50 టీఎంసీ సామర్థ్యం ఉన్న మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 7.50 టీఎంసీలు, అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో 0.83 టీఎంసీలు మాత్రమే ఉంది. ప్రాజెక్ట్‌లలో నీరు తగ్గడంతో ముంపునకు గురైన గ్రామాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. దీంతో నాడు గ్రామాలను వదిలివెళ్లిన గ్రామస్థులు తమ ప్రాంతాలకు వచ్చి అప్పటి రోజులను గుర్తు చేసుకుంటున్నారు. తాము చదువుకున్న బడిని చూసి స్నేహితులతో ఆటలాడుకున్న స్థలాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. శరీరం సహకరించకున్నా వృద్ధులు అక్కడికి వచ్చి తమ గ్రామాలను మళ్లీ చూస్తామో.. లేదోనని ఉద్విగ్నానికి గురవుతున్నారు.



శాభాష్‌పల్లి గ్రామం





చీర్లవంచ గ్రామం



రుద్రవరం ప్రభుత్వ పాఠశాల

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఆదివారం నాడు భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరిం చారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ కారణంగా లఘు దర్శనం అమలు చేయడంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి శ్రీ స్వామివారిని దర్శిం చుకున్నారు. కళాభవన్‌లో శ్రీ స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరిదేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ ఆలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మహాలింగార్చన

వేములవాడ, ఏప్రిల్ 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి ఆదివారం మహా లింగార్చన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఆలయ అర్చకులు ఉదయం వేళలో శ్రీ స్వామివారికి మహా మండపంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం శ్రీస్వామివారి కల్యాణ మండపంలో మహాలింగార్చన నిర్వహించారు. లింగాకారంలో అమర్చిన ప్రమిదలలో మహిళలు జ్యోతులు వెలిగించారు.

సమాజంలో అసమానతలను రూపుమాపాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 7: సమాజంలో అసమానతలను రూపుమాపడానికి కవులు, రచయితలు కృషి చేయాలని తెలంగాణ విశ్వవిద్యాలయ అవార్డు గ్రహీత, సాహితీవేత్త డాక్టర్ గంగ్ర లక్ష్మణ్‌రావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో ఆదివారం సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి 28వ వార్షికోత్సవం సందర్భంగా సామాజిక చైతన్య దీపిక, జ్ఞానదీపికలు, పలువురికి ఉగాది సత్కారాలు పురస్కారాలు పుస్తకాలను అవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు రచయితలు, కవులను సత్కరించారు. కార్యక్రమంలో సిరిసిల్ల సాహితి సమితి అధ్యక్షుడు డాక్టర్ జనపాల శంకరయ్య, ప్రధాన కార్యదర్శి వెంగలలక్ష్మణ్, కవులు, రచయితలు గోశికొండ మురారి పంతులు, పోరండ్ల మురళీధర్, అఖిలభారత రచయితల సంఘం అధ్యక్షు జూకంటి జగన్నాథం, కరుణాల భద్రాచలం, అకునూరి శంకరయ్య, నీరు రమేష్, చేపూరి బుచ్చయ్య, గుండ్లపల్లి శ్రీనివాస్, శ్రీగాధ మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్నారనే సమాచారంతో అక్కడకు చేరుకుని స్వాధీనపర్చుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పదేళ్ల పాలనలో ప్రజలకు న్యాయం జరగలేదు

- తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం

గోదావరిఖని, ఏప్రిల్ 7: ఎందరో పోరాటాలు, బలిదానాలతో ఏర్పడిన తెలంగాణ లో పదేళ్ల పాలనలో ప్రజలకు న్యాయం జరుగలేదని తెలంగాణ జన సమితి అధ్య క్షుడు, ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన తెలంగాణ ఉద్యోగుల సంఘం మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజ రై మాట్లాడారు. మన ఉద్యోగాలు, మన నీళ్లు, మన నియామకాల నినాదం గాలికి వదిలేశారని, కొద్ది మందికే సంపద మిగిలిందని, నిరుద్యోగ సమస్య తీరుతుందని ఆశపడ్డ నిరుద్యోగులకు నిరాశే మిగిలిందని, తెలంగాణ ఏర్పాటులో సింగరేణి కార్మి కుల పాత్ర మరిచిపోలేనిదని, 45రోజుల పాటు సమ్మె చేసి దేశ వ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కల్పించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా తెలం గాణ సస్యశ్యామలం అవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. సింగరేణి కార్మికులకు పేస్‌వర్క్‌పై అలవెన్సులు చెల్లించాలని, కార్మికులు ఉత్పత్తి చేసిన బొగ్గులో లాభాల వాటాపై 40శాతం లాభాల వాటా ఇవ్వాలని, ఓపెన్‌కాస్టులతో కాలుష్యం వెదజల్లు తుందని, వీటి స్థానంలో భూగర్భ గనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులను పర్మినెంట్ చేయాలని, మెడికల్ కాలేజీలో సింగరేణి కార్మికుల పిల్లలకు 80శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, సొంతింటి పథకం ద్వారా ఇల్లు ఇవ్వాలని, పదవీవిరమణ పొందిన కార్మికులకు రూ.20లక్షల హెల్త్ కార్డు, కార్మికులకు రూ.20లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని, కార్మికులు పని చేసేచోట నాణ్యమైన పనిముట్లను సమకూర్చాలని, కార్మికులందరికి క్యాడర్ స్కీం ఐదు సంవత్సరాలకు కుదించి అమలు చేయాలని, డిస్మిస్ కార్మికులకు ఎలాంటి నిబంధనలు లేకుండా అందరికి తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రామగుండం రీజియన్ కమిటీ అధ్యక్షులు కామెర గట్టయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు గురిజాల రవీందర్‌రా వు, సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అ హ్మద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వనాథ్, రాములు, ఈదునూరి నరేష్, దేవి సత్యం, కనకయ్య, శేఖర్, వెంకటేషం, కుమార్, భీమయ్య, రాయలింగు, రాయ పోషం, సలీంబేగ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

వైభవంగా మల్లన్న బోనాల జాతర



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని కోండ్రికర్ల గ్రామంలో కొలిచిన వారికి కొంగుబంగారంగా వెలిసిన మల్లన్న స్వామి బోనాల జాతర వైభవంగా నిర్వహించారు. ఏటా హోలీ తరువాత వచ్చే మొదటి ఆదివారం పెద్దాపూర్ మల్లన్న జాతర యాదవుల ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలను పురోహితుడు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శనివారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని పురోహితులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం బోనాల జాతర నిర్వహించారు. మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకొని శివశక్తుల పూనకాలు, పోతురాజుల నృత్యలతో డప్పుచప్పుల్ల మధ్య ఆలయానికి చేరుకున్నారు. భక్తులు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆయాభివృద్ధి కమిటీ సభ్యులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో జాతర ఉత్సవాల్లో పాల్గొన్న భక్తుల కోసం గ్రామానికి చెందిన గడ్డం రాజారెడ్డి చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆలయాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల పరిధిలోని కొత్తపేటలో నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మతల్లి ఆలయంలో ఇటీవలే పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం జరుగగా ఆదివారం బోనాల వేడుక నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మకు మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా పోతరాజు వేషధారణ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్లాల జనార్ధన్‌రెడ్డి, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, నెరెళ్ల భూమరెడ్డి, ఒడ్డెపల్లి శశాంక్, పోతరాజు శ్రీనివాస్, పోతరాజు శ్రీధర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని జోగినిపల్లి క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయికల్ మండల కేంద్రానికి చెందిన కటకం లక్ష్మీకాంతం (60) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీకాతం కోరుట్ల మండలంలోని మాదాపూర్ గ్రామంలో జరిగిన విందు కార్యక్రమంలో పాల్గొన్ని తిరిగి ద్విచక్ర వాహనంపై రాయికల్ వెళుతున్నాడు. జోగినిపల్లి క్రాస్ రోడ్డు వద్దకు చేరుకోగా వాహనం అదుపు తప్ప రోడ్డు పక్కకు పడిపోయింది. దీంతో తీవ్ర గాయలై లక్ష్మీకాతం అక్కడిక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లక్ష్మీకాతం బంధువుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కోరుట్ల ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహం అప్పగించినట్లు పోలీసులు వివరించారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

మల్యాల, ఏప్రిల్ 7: మండలంలోని ఓగులాపూర్‌కు చెందిన ఓ మహిళ అప్పుల బాదతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. బొజ్జ లక్ష్మి(38)అనే మహిళ అప్పుల బాధ భరించలేక శనివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆదివారం గ్రామ శివారులోని వేంకటెశ్వర్ల గుట్ట వద్ద చెట్టుకు ఉరి వేసుకొని కనిపించింది. దీంతో గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. లక్ష్మికి భర్తతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. లక్ష్మి భర్త బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కృష్ణకుమార్ తెలిపారు.

పోలీసులకు బాలిక అప్పగింత

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 7 : పెద్దపల్లి మండలంలోని కాపులపల్లి గ్రామం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలికను గమనించిన స్థానికులు కనగర్తి గ్రామహనుమాన్ ఆలయం వద్దకు తీసుకవచ్చి పోలీసులకు సమాచారం అందించారు. అంతకుముందు బాలికను వివరాలు అడుగగా తనది చొప్పదండి మండలం ఆర్నకొండ అని, గుర్తు తెలియని వ్యక్తులు తీసుకవచ్చి వదిలేసినట్లు తెలిపింది. పెద్దపల్లి ఎస్సై 2 మల్లేష్ పోలీస్ స్టేషన్‌కు తరలించి బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించే ప్రయత్నంలో ఉన్నారు.

నేడు హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం

- నేతన్నల సమస్యలపై చర్చ
- జేఏసీ నాయకుల వెల్లడి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 7: సిరిసిల్ల నేతన్న సమస్యలపై సోమవారం హైదరాబాద్‌లో అల్ ట్రేడ్ యూనియన్స్ రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చించనున్నామని జేఏసీ నాయకులు ప్రకటించారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో అదివారం వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్య వేదిక జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ శనివారం రాత్రి సిరిసిల్ల జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన నేతన్నల గర్జనలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసిందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపేలా ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. వస్త్ర పరిశ్రమలపై అధారపడి జీవిస్తున్న నేతన్నలందరికీ ప్రభుత్వం వెంటనే ఉపాధిని కల్పించే విధంగా చర్యలు తీసుకునేలా పోరాడుతామని తెలిపారు. శనివారం రాజీవ్‌నగర్‌కు చెందిన సిరిపురం లక్ష్మీనారాయణ అనే మరమగ్గాల కార్మికుడు సరైన ఉపాధిలేక అర్థికంగా ఇబ్బందులు పడుతూ అత్మహత్యకు పాల్పడ్డారని చెప్పారు. కాగా చేనేత జౌళీశాఖ ఏడీ మాత్రం అనారోగ్యంతో చనిపోయినట్లు పత్రిక ప్రకటన ఇవ్వడం సరికాదన్నారు. ప్రస్తుతం సిరిసిల్లలో సంక్షోభం వలన ఒక వైపు ఉపాధిలేక మరోవైపు ఆర్థికంగా ఇబ్బందులు భరించలేక మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటే అనారోగ్యం కారాణంగా అంటూ పత్రిక ప్రకటనను ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, ఎంపీ బండిసంజయ్‌కుమార్ చనిపోయిన కుటుంబాన్ని పరామర్శించి డబ్బులు అందిస్తే సరిపోదని చెప్పారు. మీరు ప్రాతినిత్యం వహిస్తున్న సిరిసిల్లలో నేతన్నల సమస్యల పరిష్కారం కోసం ఏమి చేస్తున్నారో ఆలోచించుకోవాలని హితవుపలికారు. నిజంగా అధికారులకు, ప్రభుత్వానికి , ప్రజాప్రతినిధుల కు చిత్తశుద్ధి ఉంటే మరోక కార్మికుడు బలికాకముందే వెంటనే సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సిరిసిల్ల నేతన్నల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సమస్యల పరిష్కారం కోసం సోమవారం హైదరాబా ద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అల్‌ట్రేడ్ యూనియన్ అధ్వర్యం లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో మూషం రమేష్, పంతం రవి, మండల సత్యం, తాటిపాముల దామో దర్, కట్టికోల లక్ష్మీనారాయణ, సిరిసిల్ల రవీందర్, కోడం రమణ, సిరిమల్ల సత్యం, మండల రాజు, వెల్దండి దేవదాస్, గౌడరాజు, పిస్క మధు, వేముల దామెదర్, బోడ్డు శ్రీధర్, నక్క దేవదాస్, ఒగ్గు గణేష్, బండారి అశోక్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న జేపీసీ నాయకులు

యుద్ధభేరికి తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



మాట్లాడుతున్న జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన యుద్ధభేరి సభకు ఎల్లారెడ్డిపేట జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలోని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం తరలి వెళ్లారు. స్థానిక జడ్పీటీసీ కార్యాలయం ఆవరణలో జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రజలకు అండగా నిలిచి సర్కారుపై పోరాడేందుకు బీఆర్ఎస్ ముందుకు సాగుతోందని అన్నారు.నాయకులు కృష్ణహరి, సుభాష్, శ్రీనివాస్, నర్సింలు, మల్లేశం, లక్ష్మణ్, సందీప్, మధు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిర్వహించిన యుద్ధభేరి సభకు మండలంలోని దళిత సంఘాల నాయకులు తరలి వెళ్లారు. దళిత సంఘం నాయకుడు మాజీ సర్పంచ్ మాట్ల మధు, దళిత సంఘం నాయకులు ఉన్నారు.

డంపింగ్ యార్డ్‌లో చెత్తకు నిప్పు



మామిడిపల్లిలో కాలుతున్న చెత్త

కోనరావుపేట, ఏప్రిల్ 7 : డంపింగ్ యార్డ్‌లో చెత్తకు నిప్పు పెట్టడంతో వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి, కనగర్తి తదితర గ్రామాల్లో సేకరించిన చెత్తకు నిప్పు పెడుతున్నారు. గ్రామపంచాయతీలో సేకరించిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డ్‌లో వేరుచేసి ఎరువులను తయారు చేయాల్సి ఉండగా అదేమీ పట్టనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. ఒకవైపు చెత్తను తగలబెట్టొద్దని చెబుతున్నా యథావిధిగా చెత్తను తగలబెడుతున్నారు. వేరు చేసిన తడిచెత్త ద్వారా ఎరువును తయారు చేసి రైతులకు అందించాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.


అక్కపల్లిలో తాగు నీటి కష్టాలు

- 20 రోజులుగా ఇబ్బందులు
- సరిపోని ట్యాంకర్ నీరు
- పట్టించుకోవాలని విజ్ఞప్తి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: మండుతున్న ఎండలకు గొంతులు తడారుతున్నాయి. తాగు నీటి కష్టాలకు జనం అల్లాడుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటడం, నీటి సరఫరా చేసే తాగు నీటి ట్యాంకుల వద్ద తలెత్తిన సమస్యలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మరోవైపు అధికారుల నిర్లక్ష్యం కాలనీవాసులకు శాపంగా మారింది. ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి ముదిరాజ్‌కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొంది. కాలనీకి తాగునీటి ట్యాంకే ప్రధాన ఆధారం. భూగర్భ జలాలు అడుగంటిపోవడం, నీటి ట్యాంకు వద్ద ఏర్పడిన సమస్యతో 20 రోజులుగా తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. తాగు నీటి తిప్పలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పది రోజుల నుంచి ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. రెండు రోజులకోసారి ట్యాంకరుతో నీటిని సరఫరా చేయడంతో పూర్తి స్థాయిలో సరిపడక ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకురు వస్తేనే తమ గొంతులు తడుస్తున్నాయని వాపోతున్నారు. వాటర్ ట్యాంక్‌కు మరమ్మతు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో తాగు నీటికి అవస్థలు పడుతున్నామని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, కష్టాలను తీర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ట్యాంకరు వద్ద నీరు పట్టుకుంటున్న కాలనీవాసి



అక్కపల్లిలోని వాటర్ ట్యాంక్

మా గోడు పట్టించుకోవడం లేదు



- జెట్టి నర్సవ్వ, కాలనీ మహిళ

మా కాలనీలో తాగు నీటికి ఇబ్బంది అవుతోంది. తాగు నీటి కోసం బోర్ల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోంది. పనులు వదులుకొని గంటల తరబడి నిరీక్షిస్తున్నాం. 20 రోజులుగా గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఎండలో కష్టాలు పడుతున్నాం



- పండుగ ముత్తవ్వ, కాలనీమహిళ

ఎండలో నీళ్ల కోసం నిలబడుతున్నాం. కష్టాలు పడుతున్నాం. తాగు నీరు రాక అవస్థలు పడుతున్నాం. గుక్కెడు నీరు అందక దాహంతో చస్తున్నాం. మా కాలనీకి నీరు అందించి కష్టాలు తీర్చాలే.

కరెంటు సమస్యతో ఇబ్బందులు

- జాఫర్, పంచాయతీ కార్యదర్శి

గ్రామంలో నెలకొన్న కరెంటు సమస్యతో తాగు నీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రెండు రోజులకోసారి ట్యాంకరు ద్వారా నీటిని అందిస్తున్నా.. సరిపోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. సెస్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడంతో పాటు తాగు నీటికి కాలనీవాసులు పడుతున్న కష్టాలను తీరుస్తాం.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 7: జిల్లాలోని ఏడు తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్‌లలో 2024- 25 విద్యా సంవత్సరానికి 6వ తరగతినుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆదివారం జిల్లా వ్యాప్తంగా 8 కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించారు. 6వ తరగతిలో 1116 మందికి 995 విద్యార్థులు హాజరయ్యారు. 7వ తరగతిలో 243 మందికి 209 మంది హాజరయ్యారు. 8వ తరగతిలో 220 మందికి 192 హాజరయ్యారు. 9వ తరగతిలో 135 మందికి 112 హాజరయ్యారు. 10వ తరగతిలో 21 మందికి ఒక్కరు రాలేదు. జిల్లావిద్యాధికారి రమేష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీఆర్ఎస్‌కు మండల ఉప సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడి రాజీనామా

తంగళ్లపల్లి, ఏప్రిల్ 7: తంగళ్లపల్లి మండల ఉపసర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పెద్దూరు తిరుపతి బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఎన్నో సంవత్సరాలుగా పార్టీకి సేవలు అందించానని, తాను ఇబ్బందుల్లో ఉంటే బీఆర్ఎస్ తనకు సహాయ సహకారాలు అందించలేదని పేర్కొన్నారు. మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు, అందుకే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

కట్టమైసమ్మకు మొక్కులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ శివారులోని సింగసముద్రం చెరువు కట్టమైసమ్మ ఆలయంలో ఆదివారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో రైతులు డప్పుచప్పుళ్ల మధ్య దున్నపోతును ఊరేగించారు. బైండ్లవారి నృత్యాల మధ్య ముందుకు సాగారు. కట్టమైసమ్మ ఆలయం వరకు చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువులో చేపల మృతి

కోనరావుపేట ఏప్రిల్ 7: కోనరావుపేట మండలం మల్కపేట పెద్ద చెరువులో ఎండ తీవ్రతకు చేపలు మృతి చెందుతున్నాయి. పెద్ద చెరువులో నీటి మట్టం తగ్గడంతోపాటు ఎండ వేడిమికి తట్టుకోక సుమారు ఐదు క్వింటాళ్ల చేపలు మృతి చెందినట్లు మత్స్యకారులు తెలిపారు. ఐదు క్వింటాళ్ల చేపలు మృతి చెందడంతో నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు

ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని అంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, పుష్పార్చన తదితర కార్యక్రమాలను చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐకి సన్మానం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. గుడుంబా ఆధారిత కుటుంబాలకు ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వానికి విన్నవించాలని కోరారు. పల్లెల్లో కొనసాగుతున్న మద్యం అనుబంధ దుకాణాలను చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ మండల యువజ విభాగం అధ్యక్షుడు రాజునాయక్, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి కృషి

ముస్తాబాద్, ఏప్రిల్ 7: తెలంగాణ అభివృద్ధికి వినోద్‌కుమార్ కృషి చేశారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ముస్తాబాద్ మండలం మోయినికుంటలో ఆదివారం మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఢిల్లీ స్థాయిలో ముఖ్య భూమిక పోషించారన్నారు. కరీంనగర్ ఎంపీగా వినోద్ కుమార్ గెలవడం ఖాయమన్నారు. పదేళ్ల కాలంలో ఎండని మిడ్‌మానేరు కేవలం మూడు నాలుగు నెలల్లో బీటలుబారి పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్ట పోయిన రైతులను ఆదుకోవాలన్నారు. ఆర్‌బీఎస్ మండల మాజీ అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, మాజీ ఎంపీపీ వైస్ చైర్మన్‌లు బత్తుల అంజయ్య, యాది మల్లేశ్, శీలం జనాబాయి, మాజీ సర్పంచ్ ద్యావతి పండరి, కొమ్ము బాలయ్య, చెవుల మల్లేశ్, సంతోష్‌రావు పాల్గొన్నారు.

రైతులు, నేతన్నలను వంచించి దీక్షలు చేయడమా?



సమావేశంలో మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: పదేళ్ల కాలంలో అధికారంలో ఉండి అన్నదాతలు, నేతన్నలను పట్టించుకోకుండా వంచించిన బీఆర్ఎస్, మాజీ మంత్రి కేటీఆర్ దీక్షలు చేయడం ఏమిటని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ప్రశ్నించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ దీక్ష చేయడం దొంగతనం చేసి నోళ్లు దొంగ దొంగ అని అరిచినట్టుందన్నారు. రైతులను ఆదుకోకుండా మోసగించి ప్రస్తుతం అన్నదాతలకు అండగా పోరాడుతామని పేర్కొనడంతో రాజకీయ రంగు బయట పడుతోందన్నారు. నేతన్నకు చెల్లించాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉంచి నేతన్న సంక్షేమం కోసం మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలో ఉన్న సమయంలో సర్కారు రైతులు, నేతన్నలను ఆదుకుందని నిజాయితీగా ధర్నా, రాస్తారోకోలు చేస్తే ప్రజలు నమ్ముతారన్నారు. ప్రభుత్వ హయాంలో వారి సంక్షేమాన్ని విస్మరించి రాజకీయ పబ్బం కోసం ఆందోళనలు చేస్తామంటే చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. గత ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా మార్పు రాలేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ కల్లబొల్లి మాటలతో ఊసరివెల్లి రాజకీయాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. చేసిన తప్పులను ఒప్పుకొని రైతులు, నేతన్నలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటు పడుతోందన్నారు. తుక్కుగూడలో కాంగ్రెస్‌ఆధ్వర్యంలో నిర్వహించినబహిరంగ సభను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు లింగాగౌడ్, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, రాజుకుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 7: జిల్లా క్రీడకారులు జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలో రాజన్న సిరిసిల్ల ప్రీమియర్ - 2024 క్రికెట్ పోటీలను బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతను చాటుకుంటూ క్రికెట్ పోటీలను నిర్వహించుకోవాలన్నారు. పట్టుదలతో సాధన చేయాలని, పోటీలో ప్రతిభను కనబరిస్తే తప్పకుండా గుర్తింపు ఉంటుందని అన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. సోమవారం ఉదయం ఆరు గంటలకు సిరిసిల్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రచారంలో భాగంగా మార్నింగ్ వాక్‌లో పాల్గొని పట్టణ ప్రజలను నేరుగా కలుస్తారన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, నాయకులు గుండ్లపెల్లి పూర్ణచందర్, అడగట్ల మురళి, క్రీడాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిందం చక్రపాణి

నారాయణ కుటుంబానికి ప్రభుత్వం అండ



రాజీవ్‌నగర్‌లో నారాయణ అంత్యక్రియల్లో కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 7: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న సిరిపురం నారాయణ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. సిరిసిల్లలో మూడు నెలలుగా వస్త్ర పరిశ్రమ సంక్షోభం నెలకొని పరిశ్రమలు బంద్‌కావడం, ఉపాధి పనులు లేకపోవడంతో సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సిరిపురం నారాయణ అనే నేతన్న శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ ఆధ్వర్యంలో నాయకులు రాజీవ్‌నగర్‌కు వెళ్లి నారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బాలరాజు, వంతడ్పుల రాము తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలి పెంచాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 7: ఉపాధిహామీ కూలి పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శావనపల్లి మల్లేశం అన్నారు. మండలంలోని తాళ్లపల్లిలో ఆదివారం ఉపాధిహామీపనుల వద్దకు వెళ్లి కూలీల సమస్యలు అడిగి తెలుసుకన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనులను ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే చేయించాలన్నారు. పనుల వద్ద సరైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

నారాయణపూర్‌లో ఇఫ్తార్ విందు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక మసీద్‌లో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అన్నారు. ఎంపీటీసీ అపెరాసుల్తానా, నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, షాదుల్లా, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ యాత్రను విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్యాంగ రక్షణ యాత్రను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రామచంద్రం కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో యాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆ సంఘం నాయకులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం మూల స్తం భాలుగా భారత రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రూపొందిస్తే కేంద్ర ప్రభుత్వ పాలనలో రాజ్యాంగంలోని మౌలిక సూత్రాల పునాదులు ధ్వంసమవుతున్నాయన్నారు. జీవించే హక్కు, స్వేచ్ఛను కోల్పోయే ప్రమాదం ఏర్పడుతోందన్నారు. రాజ్యాంగ హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు మేధావులు, ప్రజాస్వామికవాదులు రాజకీయాలకు అతీ తంగా మద్దతు ప్రకటించి రాజ్యాంగ రక్షణ యాత్రలో భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈ నెల 8న హైదరాబాద్‌లో జరిగే ముగింపు సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఎల్లం, రామదాసు, చంద్రం, మల్లేశం, వంశీకృష్ణ, ధర్మేందర్, ప్రభాకర్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎన్నికలు రాగానే రైతులు గుర్తొచ్చారా?

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 7: అధికారం కోల్పోగానే మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులకు హఠాత్తుగా రైతులు గుర్తుకు వచ్చారా? అని మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ప్రగతి భవన్, ఫాంహౌస్‌కే పరిమితమై రైతులు, సామాన్య ప్రజలకు కలిసే అవకాశమే ఇవ్వకుండా రాచరికపు పాలన సాగించారన్నారు. ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టంతో ప్రస్తుతం అధికారం కోల్పోగానే రైతులు, పంట పొలాలు గుర్తుకు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరితే 2017లో రైతులకు బేడీలు వేసి, ఇప్పుడు రైతు దీక్షల పేరుతో మొసలి కన్నీరు కారిస్తే ఎవ్వరూ నమ్మరన్నారు. గత సంవత్సరం కురిసిన అకాల వర్షాలకు నిజామాబాద్, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాల్లో దాదాపు 20 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు 10 వేలు సహాయం చేస్తామన్నారు. పంటన నష్టపోయిన రైతులకు 10 రోజుల్లో పరిహారం ఇస్తామని అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గడిచిన మూడు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఖర్చుల కోసం లక్షల రూపాయల ఎల్‌వోసీ పొందిన రోగుల వివరాలను, ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థుల వివరాలు ఇస్తామన్నారు. ఈ విషయంలో ప్రభుత్వంపై కేసీఆర్ చేసిన ఆరోపణలపై పత్రికా ముఖంగా క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాముడి పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ నేత బండి సంజయ్ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధి కోసం కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థిని త్వరలోనే అధిష్ఠానం నిర్ణయిస్తుందని, అభ్యర్థి గెలుపునకు అందరూ కట్టుబడి ఉంటామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేసి ప్రజా స్వామ్యాన్ని కాపాడాలని ప్రజలను కోరారు. అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

నేతన్నల ఆకలి చావులను ప్రోత్సహిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 7 : నేతన్నల ఆకలి చావులను రాజకీయ పార్టీల నాయకులు ప్రోత్సహిస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వస్త్ర పరిశ్రమలో సంక్షోభం ఏర్పడి మూడు నెలలు నుంచి పరిశ్రమలు బంద్ చేయడంతోపాటు ఉపాధి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న నేతన్నలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. 10 సంవత్సరాల పాటు పాలించిన ప్రభుత్వం మరమగ్గాల కార్మికులకు శాశ్వత ఉపాధిని కల్పించకుండా తాత్కాలిక ఉపాధిని కల్పించిందన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నలకు ఉపాధిని కల్పించకపోవడంతో నేతన్నలు ఉపాధిలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుటంబ పోషణకు బారమై కార్మికులు ఆత్మహత్యకు పాల్పడితే రాజకీయ పార్టీల నాయకులు వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించి డబ్బులను అందజేయడం సిగ్గుచేటన్నారు. వారు బతికి ఉండగా ఉపాధిని కల్పించని నాయకులు చనిపోయిన తరువాత డబ్బులు ఇస్తూ అండగా ఉంటామని హామీ ఇవ్వడం ఓట్ల లబ్ధి కోసం రాజకీయాలు చేయడమేనని అన్నారు. కార్మికులకు శాశ్వత ఉపాధిని చూపించకుండా చనిపోయిన తరువాత డబ్బులు ఇవ్వడం దుర దృష్టకరమన్నారు. నేతన్నలకు సరైన ఉపాధిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించకపోతే జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికులు తమ ఓట్లతో బుద్ధి చెప్పాలని ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు.

మల్లన్న జాతరకు హాజరైన ఎమ్మెల్యే

కథలాపూర్, ఏప్రిల్ 7: మండలంలోని ఊట్‌పల్లిలో ఆదివారం జరిగిన మ ల్లన్న జాతరకు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు కాంగ్రెస్ శ్రేణులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలకగా అర్చకులు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. కాగా జాతరకు చుట్టు పక్కన గ్రామాలైన భూషణరావుపేట, పెగ్గెర్ల, చింతకుంట, మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని మొ క్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం మహిళలు బోనాలు సమర్పించు కోగా పుర వీధుల వెంట డోలు వాయిద్యాలతో కళాబృందం చేసిన నృత్యాలు అలరిం చాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయ కులు ముదాం రాజేశం, శేఖర్, చెదలు సత్య నారాయణ, కాయితి నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.



పెగ్గెర్లలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

మాజీ సీఎం కేసీఆర్‌కు మతిభ్రమించింది

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 7: అధికారం కోల్పోయిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యను కొంత మంది ఉద్దేశ పూర్వకంగా జఠిలం చేస్తున్నారన్నారు. సమస్యను జఠిలం చేసేందుకు కొంత మంది యజమానులు, ఆసాములను, కార్మికులను ఉసి గొలిపి సమ్మెకు దారి తీయించార న్నారు. గతంలో ఎప్పుడైనా, ఎక్కడైనా కేసీఆర్ ధర్నాలో పాల్గొన్నారా? అని ప్రశ్నించారు. అలాంటి కేసీఆర్‌కు ఈ రోజు ధర్నాలు చేయండని చెప్పడం సిగ్గు అనిపించడం లేదా అన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం మానుకోవాలని, లేకపోతే మరోసారి ప్రజల చేత చీత్కారం తప్పదని హెచ్చరించారు. ఎంపీగా రెండు సార్లు, కేంద్ర కార్మిక మంత్రిగా ఒక్కసారి, పది సంవత్సరాలు రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఇక్కడి కార్మికులకు చేసింది ఏంటో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతోనే సమస్యలు వచ్చాయని కేసీఆర్, కేటీఆర్ చెప్పడం తప్పన్నారు. నాడు ప్రజాప్రతినిధిగా కేటీఆర్ రూ. 272 కోట్లు పెండింగ్‌లో ఉండే వరకు ఏం చేశారన్నారు. బతుకమ్మ చీరలకు కొందరు ఏజెంట్లను పెట్టి వారి ద్వారా ప్రభుత్వం కావల్సినంత ధరకు కొనుగోలు చేసిందన్నారు. ఈ స్కీం పేదలు, కార్మికుల కోసం కాదని, కొంత మంది మాస్టర్ వీవర్స్ పుట్టించిన కార్యక్రమని ఆరోపించారు. బతుకమ్మ చీరల ద్వారా లాభపడింది ఎవరని ప్రశ్నించారు. బతుకమ్మ చీరల తయారీలో తీవ్రమైన అవినీతి జరిగిందని ఆరోపించారు. టెక్స్‌టైల్ ఉన్నత అధికారుల నుంచి మొదలు మంత్రి కేటీఆర్ వరకు అవినీతి జరిగిందన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో రేపు జైలుకు వెళ్లే పరిస్థితి ఏర్పడితే ఎంట్లుంటానోనని కేసీఆర్ సిరిసిల్ల వచ్చి రెచ్చగొట్టి పోయాడని ఆరోపించారు. రూ.272 కోట్లు బతుకమ్మ చీరల బకాయిలు ఇప్పించే బాధ్యత తీసుకుంటామని, వస్త్ర వ్యాపారులతో మాట్లాడి మరమగ్గాలు ప్రారంభించే దమ్ము కేటీఆర్‌కు ఉందా? అని ప్రశ్నించారు. కార్మికులు లేనిది ఆసాములు, యజమానులు లేరన్నారు. బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాంల బిజినెస్ ఇచ్చిందని, దాదాపు 30 మంది వ్యాపారులు 50 కోట్లకు తక్కువగా లేరని వారందరిపైన విచారణ జరిపించే దమ్ము కేటీఆర్‌కు ఉందా అన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి మృత్యుంజయం

రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి సమస్యలను తీసుకెళ్లామని, స్వయంగా వచ్చి వ్యాపారులు, కార్మికులుతో చర్చిస్తామని మంత్రి చెప్పారని అన్నారు. సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ దందా ఇంకా కొనసాగుతోందని, అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. స్థానిక అవసరాల కోసం ఇసుకకు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇసుక అక్రమ తరలింపును స్థానికులు అడ్డుకోవాలని సూచించారు. రాష్ట్రం అంతా కలెక్టర్, ఎస్పీలు మారారు కాని సిరిసిల్లలో మాత్రం మారలేదన్నారు. ఫేర్ అండ్ ఫ్రీగా పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో జరగాలంటే అప్పటి అధికారులు ఎవరు ఉండకూడదన్నారు. ఎలక్షన్ కమిషనర్ ఆఫ్ ఇండియా వారికి లేఖ రాస్తానన్నారు.

దేశ వ్యాప్తంగా సిరిసిల్లకు ఒక గుర్తింపు ఉందన్నారు. సిరిసిల్లను కాపాడుకోవడం కోసం కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించడం కోసం ప్రణాళిక రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్తామని, ఒప్పించే బాధ్యతను తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, నాయకులు కత్తెర దేవదాస్, కామినేని రవీందర్, గుజ్జె రమేష్, దొంతు దేవదాస్, మేకల కమలాకర్, వెంగళ అశోక్, వైద్య శివప్రసాద్, చోటు పాల్గొన్నారు.